అధిక వడ్డీ వ్యాపారుల అఘాయిత్యాలు ఆగడం లేదు. రుణ ఒత్తిడులకు ప్రాణాలు కూడా తీసుకునే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటీవలే అనంతపురం నగరం, ధర్మవరం పట్టణంలో అధిక వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అధిక వడ్డీ భారాన్ని మోయలేక ఒక బ్యాంకులో చిరుద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. అనంతపురం నగరంలో బుధవారం నాడు బ్యాంకు కార్యాలయంలోని బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల బాధతోనే చనిపోతున్నట్టు రాసిన సూసైడ్ నోట్ కూడా లభించింది.

ఆగని అధిక వడ్డీ ఆగడాలు..!

- రుణబాధతో బ్యాంకు చిరుద్యోగి ఆత్మహత్య
- అప్పుల బాధతోనే చనిపోతున్నట్టు సూసైడ్ నోట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని గుత్తిరోడ్డులో ఉన్న సెంట్రల్ బ్యాంకులో ఎస్.రవికుమార్(35) ఎప్పటిలాగానే బుధవారం ఉదయం 9.30 గంటలకు బ్యాంకుకు వచ్చాడు. 9.40 గంటల సమయంలో బ్యాంకులోని బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి బ్యాంకు సిబ్బంది తలుపులను పగులగొట్టి చూశారు. బాత్‌రూమ్‌లో వెంటిలేషన్‌కున్న ఇనుప చువ్వలకు తాడుతో ఉరివేసుకున్నట్టు గుర్తించి వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందించారు. త్రీటౌన్ సిఐ శాంతిలాల్ సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికే రవికుమార్ చనిపోయినుట్ట గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

అధిక వడ్డీలతో అనంతపురంలో ఉరేసుకున్న బ్యాంకు చిరుద్యోగి రవికుమార్

అప్పుల బాధతోనే ఆత్మహత్య

రవికుమార్ సెంట్రల్ బ్యాంక్‌లో సబ్ స్టాఫ్ (అంటెడరు)గా 2013 నుంచి పనిచేస్తున్నాడు. ఈయన కుటుంబ అవసరాల కోసమని గుజ్జల రాముడు అనే వ్యక్తి వద్ద నుంచి రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. రూ.15 వేలు ముందు వడ్డీ కింద పట్టుకుని రూ.35 వేలు ఇచ్చారు. నెలకు రూ.15 వేలు చొప్పున వడ్డీ చొప్పున ఇప్పటికే రూ.1.25 లక్షలు కట్టినట్టు రవికుమార్ తన సూసైడ్ నోట్‌లో రాశాడు. ఇక తాను కట్టలేనని, తన వల్ల కావడం లేదని ఆ నోట్‌లో పేర్కొన్నాడు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు, భార్య హరితకు లేఖ రాశాడు. పిల్లలను బాగా చూసుకోవాలంటూ ఆ తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

ఆగని అధిక వడ్డీ వ్యాపారుల ఆగడాలు

కుటుంబ అవసరాల నిమిత్తం అప్పు కోసం వెళ్తే అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో వారి వద్ద అప్పులు చేసి, వాటి నుంచి బయటపడలేక పేదలు అవస్థలు పడుతున్నారు. ఇటీవలే ఇటువంటి ఘటనలు అనంతపురం నగరం, ధర్మవరం పట్టణంలో వెలుగుచూశాయి. అనంతపురంలో డబ్బు చెల్లించలేదని నడి వీధిలో దౌర్జన్యానికి దిగిన ఘటన చోటు చేసుకుంది. ధర్మవరంలో ఇంటికెళ్లి దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఇలా వరుసగా అధిక వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. వడ్డీ వ్యాపారులపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం స్పందించి వడ్డీ వ్యాపారుల ఆగడాలను అరికట్టే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చే'నేత'కు నిరాదరణ..!

- 'పట్టు' కోల్పోతున్న చేనేత రంగం
- అందని ప్రభుత్వ సాయం
- వృత్తికి దూరం అవుతున్న కార్మికులు
- వెంటాడుతున్న అప్పుల భారాలు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న చేనేత రంగం పాలకులు, ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురవుతోంది. దశాబ్ధాల పాటు ఆడిన మగ్గం నేడు మూలన పడింది. రంగురంగుల హరివిల్లు లాంటి అందమైన పట్టుచీరను తయారు చేసే నేతన్న కష్టాల కడలిలో కూరుకుపోయాడు. వ్యవసాయం తరువాత అత్యధిక మంది జీవనం సాగిస్తున్న చేనేతపై పాలకుల చిన్నచూపు కొనసాగడంతో ఈ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. ఒకప్పుడు వేల మందికి ఉపాధినిచ్చిన చేనేత నేడు దాని ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది. ప్రభుత్వాలు ఆదుకుంటాయని ఆశగా ఎదురు చూడడం తర్వాత భంగపడడం నేతన్న వంతైంది. నిరాధరణకు గురవుతున్న నేతన్న కష్టాలను తెలియజేస్తూ 'ఆగస్టు 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవం' సందర్భంగా ప్రజాశక్తి అందిస్తున్న ప్రత్యేక కథనం...

ప్రజాశక్తి-అనంతపురం, ధర్మవరం రూరల్

రాష్ట్రంలోనే అత్యధికంగా చేనేత కార్మికులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్నారు. జిల్లాలోని ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, రాప్తాడు, ఉరవకొండ, పుట్టపర్తి, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు ఉన్నారు. ధర్మవరం కేంద్రంగా చేనేత వ్యవస్థ కొనసాగుతోంది. హ్యాండ్‌లూమ్స్ వ్యవస్థ బాగా ఉన్న క్రమం కాస్తోకూస్తో నేతన్నకు ఆసరగా ఉండేది. పవర్‌లూమ్స్ రాక, పాలకుల నిర్లక్ష్యంతో రానురాను చేనేత వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. ముడిసరుకుల ధరలు పెరగుదల, చీరలకు గిట్టుబాటు ధరల లేకపోవడం తదితర కారణాలతో చేనేత రంగం కుదేలైంది. దీనికి తోడు దేశం లోని ఆర్థిక మాద్యం ప్రభావం చేనేత రంగాన్ని మరింత కుదేలు చేసింది.

నేతన్నల ఆత్మహత్యలు

నమ్మకున్న వృత్తిలో గిట్టుబాటు లేక, ఇతర ఉపాధి వనరులు లేక నేతన్న ఆత్మహత్యలకు పాల్పడుతూనే ఉన్నారు. ధర్మవరంతో పాటు పలు ప్రాంతాల్లో చేనేత కార్మికుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. పెద్ద దిక్కును కోల్పోయిన చేనేత కుటుంబాలు నేడు దుర్భరస్థితిలో జీవనం సాగిస్తున్నాయి. చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాని ప్రభుత్వం ఇచ్చే సాయం కూడా పూర్తి స్థాయిలో అందడం లేదు. వివిధ నిబంధనల సాకుతో ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండా కార్మికులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షలకు పెంచాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

ఆగిన ప్రభుత్వ పథకాలు

చేనేత కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు ఆగిపోయాయి. రాష్ట్ర విభజన, ఆ తర్వాత టిడిపి అధికారంలో ఉన్న సమయంలో పట్టు రాయితీ పేరుతో చేనేత కార్మికుకుని ఆర్థిక సాయం అందించే వారు. వైసిపి అధికారంలోకి వచ్చాక దీనిని రద్దు చేసి దాని స్థానంలో నేతన్న నేస్తం పేరుతో రూ.24వేలు ఇచ్చారు. ఈ పథకం అర్హతకు అప్పటి ప్రభుత్వం అనేక నిబంధనలు విధించడంతో చాలా మంది నేతన్నలకు ఈ సాయం అందలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ మాత్రం సాయం కూడా చేనేత కార్మికులు ఇవ్వలేదు. మగ్గం నేసుకనే కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటును ఇస్తామని చెబుతున్నా ఇంకా ఇది అమలుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఒకటిన్నర సంవత్సరం గడిచినా కార్మికులకు చెప్పకోదగ్గ సాయం ఏదీ అందలేదు. గతంలో చేనేత కార్మికుల వైద్య చికిత్సల నిమిత్తం ఐసిఐసి లంబోర్డ కార్డు ఉండేది. అది అందలేదు. ఇక చేనేత కార్మికుల పింఛన్లు కూడా వివిధ నిబంధనల పేరుతో కోతల విధిస్తున్నారు. రుణపరపతి కార్డు ద్వారా ఎలాంటి ష్యూరిటీ లేకుండా బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉండగా బ్యాంకర్లు ఆదిశగా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పథకాలను ప్రవేశపెట్టకపోగ ఉన్న పథకాలను కూడా నిలిపేసి కార్మికున్ని మరింత కష్టాల్లోకి నెడుతోంది.

జీఎస్టీతో మరో పిడుగు

ఉన్న కష్టాలకు తోడు చేనేత రంగంపై కేంద్ర తీసుకొచ్చిన జీఎస్టీ దెబ్బ మరింత తీవ్ర నష్టాన్ని చేకూరుస్తోంది. యంత్రాలతో తయారయ్యే వస్త్రంపై 5 శాతం జీఎస్టీ అమలు చేసిన కేంద్రం చేతి వృత్తులపై తయారయ్యే దానికి కూడా దానిని వర్తింపజేసింది. ఈ నూతన విధానంతో అమ్మకం, కొనుగోలు దారులు ఇద్దరూ నష్టాన్ని చూడాల్సి వస్తోంది. వీటితో పాటు ముడిపట్టుపై 5 శాతం, జరీపై 12, అద్దకం, రంగులపై 18, పట్టు వస్త్రంపై 5 శాతం జీఎస్టీని విధిస్తూ నిర్ణయం తీసకుంది. ఇప్పటికే ఆదాయం లేక ఇబ్బందుల్లో ఉన్న కార్మికుడు జీఎస్టీ దెబ్బకు కుదేలు అవుతున్నారు.



అమలుకాని చేనేత రిజర్వేషన్ చట్టం

చేనేత రంగ పరిరక్షణ కోసం 1985లో చేనేత రిజర్వేషన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీని ప్రకారం 11 రకాల చేనేత వస్త్రాలను హ్యాండ్‌లూమ్ మినహా మిగతా దేనిద్వారా తయారు చేయకూడదనే నిబంధన చేసింది. ఇందు కోసం ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖను ఏర్పాటు చేసింది. 1990 వరకు ఆ చట్టం సరిగా అమలైంది. తరువాత ఇందులో మార్పులు చోటు చేసుకున్నాయి. 2000 సంవత్సరం వచ్చే సరికి రిజర్వేషన్ చట్టం పూర్తికి అతిక్రమణకు గురైంది. చేనేత రకాలను ఇబ్బడి ముబ్బడిగా పవర్‌లూమ్స్‌లో తయారు చేయడం మొదలైంది. రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చుట్టపుచూపుగా తనిఖీలు నిర్వహిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. దీంతో పవర్‌లూమ్స్ విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అయినా వీటిని నియంత్రించడంలో అధికారులు విఫలం అయ్యారు. హ్యాండ్‌లూమ్స్‌లో తయారయ్యే చీరలను పవర్‌లూమ్‌లో తయారు చేయకూడదన్న నిబంధనను ప్రభుత్వం అమలు చేయడం లేదు. ప్రస్తుతం ధర్మవరం మార్కెట్లో విచ్చలవిడిగా పవర్‌లూమ్ చీరల విక్రయాలు కొనసాగుతున్నాయి. దీనిపై నిఘా ఉంచాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పవర్‌లూమ్స్ చీరల విక్రయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి వాటిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఆటో ఢీకొని విరిగిన రైల్వే గేటు

కింద పడిన గేటు

రాయదుర్గం : పట్టణంలోని అనంతపురం రోడ్డు వద్ద ఉన్న రైల్వే క్రాసింగ్ గేటును బుధవారం ఆటో ఢీకొంది. దీంతో గేటు విరిగిపడింది. రైలు పట్టాలపై గూడ్స్ రైలు వస్తుండగా గేట్ మెన్ రైల్వేగేటు వేశాడు. ఈలోగా గేటును దాటాలనే ఉద్దేశంతో ఓ డీజిల్ ఆటో వేగంగా వచ్చి గేటును ఢీకొంది. దీంతో గేటు విరిగింది. గేటు విరగడం నెలరోజుల వ్యవధిలో మూడోసారి. వెంటనే ఆ సమయంలో ఎలాంటి వాహనాలు రోడ్డున దాటకుండా గేట్‌మెన్, కొందరు యువకులు పర్యవేక్షించారు.

వేదావతికి జలకళ

ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి నది

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి జోరువాన కురిసింది. భారీ వర్షానికి వేదావతి నది నీటితో పరుగులు తీసింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో బళ్లారి-కనేకల్ ప్రధాన రహదారిపై బుధవారం ఉదయం 11 గంటల వరకు వాహన రాకపోకలు నిలిచాయి. భారీ వస్తున్న నీటి ప్రవాహంలో రాకపోకలు చేయకుండా ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో వాహనదారులను ఆపేశారు. వాహనాలను ఆపేయడంతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

ఆదమరిచారా.. అంతే..!

సగం కూలిన కల్వర్టు

కూలడానికి సిద్ధంగా కల్వర్టు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని కందికాపుల నుంచి తాడపత్రికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డులో ఏర్పాటు చేసిన కల్వర్టు కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ రోడ్డుపైన రోజూ వందలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అయినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని వాహనదారులు వాపోతున్నారు. ప్రస్తుతం కల్వర్టు సగంపైనే కూలింది. కనీసం మరమ్మతులు చేసిన పాపానపోలేదని అంటున్నారు. ఇలా ఉండి దాదాపు సంవత్సరం అవుతోంది. ఇలాంటి కల్వర్టుపై వెళ్లేటప్పుడు ఆదమరిచారా.. అంతే సంతగతులు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కూలడానికి సిద్ధంగా ఉన్న కల్వర్టుకు మరమత్తులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ అధికారిగా వెంకటరమణ

అనంతపురం : సత్య సాయి జిల్లా తాడిమర్రి మండలం మోదుగులకుంట గ్రామానికి చెందిన పి.వెంకట రమణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ అధికారిగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా అగ్నిమాపక అధికారి సంతోషం వ్యక్తపరుస్తూ అభినందనలు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వ్యక్తి డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ అధికారిగా బాధితులు చేపట్టడం సంతోషకరంగా ఉందని ఉమ్మడి అనంతపురం జిల్లా అగ్నిమాపక శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎంపి నిధులు పెంచి జిఎస్‌టిని మినహాయించాలి : అంబికా

అనంతపురం కలెక్టరేట్: 2011 జనాభా ప్రకారం ప్రతి ఎంపికి సంవత్సరానికి కేటాయిస్తున్న ఎంపి ల్యాడ్స్ నిధులు పెంచాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం నిర్వహించిన పార్లమెంట్ సమావేశంలో ఎంపి నిధుల పెంపుదల, ల్యాడ్స్ నిధులు వెచ్చించే అభివృద్ధి పనులపై జిఎస్‌టి ఉప సంహరించాలని చర్చను అంబికా లేవనెత్తారు. ప్రతి ఎంపీకి కనీసం రూ.10కోట్లకు నిధులు పెంచాలన్నారు. దీనికితోడు పనులకు పూర్తిగా

మాట్లాడుతున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

బాల్య వివాహాలు నేరం

తల్లిదండ్రులకు అంగీకార పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

బ్రహ్మసముద్రం : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అధికారులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బైరువానితిప్ప గ్రామంలో చేస్తున్న బాల్య వివాహాన్ని స్త్రీ శిశు సంక్షేమ, రెవెన్యూ, పంచాయతీ శాఖల ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. అనంతరం బాల్యవివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. అనంతరం 18 ఏళ్ల వచ్చేదాకా వివాహం చేయమని తల్లిదండ్రులతో అంగీకార పత్రాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అనిమేష్ (హనుమంతరావు), పంచాయతీ కార్యదర్శి అనిల్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ, అంగన్వాడీ కార్యకర్త యల్లక్క, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇళ్లలోకి వర్షం నీరు వెళ్లి నిత్యావసర సరకులు, ఇతర వస్తువులను నష్టపోయిన తిలక్‌నగర్ వాసులకు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బాధితులతో కలిసి బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు తిలక్‌నగర్‌లోని మురికి కాలువలు నిండిపోయి ఇల్లోకి మురుగునీరు చేరి నిత్యావసర సరుకులు, విద్యుత్ పరికరాలు పాడైపోయి పేదలు నష్టపోయారన్నారు. అదేవిధంగా కాలనీలో ఓ వ్యాపారి అంగడి సరుకులు తడిసిపోవడంతో రూ.లక్ష నష్టం సంభవించిందన్నారు. ఇందుకు ముఖ్య కారణం ఆ సందులో డ్రెయినేజ్ నీరు పోవడానికి సరైన మురికి కాలువలు లేకపోవడమే అన్నారు. ఉన్న కాలువల్లో పూడిక పేరుకుపోయి వర్షం నీరు ఇళ్లలో చేరడంతో నష్టం జరిగిందన్నారు. ఇందుకు స్పందించిన కమిషనర్ కాలువ నిర్మాణం, పూడికతీత పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి, కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, వైటిసి రమేష్, డివైఎఫ్ఐ నాయకులు సురేంద్ర, వంశీ, బాధితులు ఏకాంబరం, సయ్యద్‌బాషా, ఇస్మాయిల్, శిరీషా, సయ్యద్‌బాషా, టైలర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌తో మాట్లాడుతున్న సిపిఎం, డివైఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ కళాశాలలో ఒకేషనల్ కోర్సులు ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరుణ్ రషీద్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు వంటి ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎం హరుణ్‌రషీద్ కోరారు. ఈమేరకు బుధవారం ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గ విద్యార్థులు ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు వంటి ఒకేషనల్ కోర్సులు ఏర్పాటు చేయకపోవడం వల్ల అనంతపురం, గుంతకల్లు దూర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసించాల్సి వస్తోందన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఉరవకొండ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యాకోర్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పిఇటి, పీడీ అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు క్రీడల్లో రాణించలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌కు సంబంధించిన అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉరవకొండ పట్టణ అధ్యక్షుడు రాజేష్, ఉపాధ్యక్షులు సిద్దార్థ, నాయకులు పవన్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉరవకొండ ప్రభుత్వ సెంట్రల్ హైస్కూల్ క్రీడాకారులు సత్తాచాటారు. ఈనెల 4, 5వ తేదీల్లో చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ఉరవకొండలోని ప్రభుత్వ సెంట్రల్ హైస్కూల్ విద్యార్థినులు అమృత, అనిషా, వైశాలి, భవ్య, అంజలి, సఫియా,సరిత, పాల్గొని చిత్తూరు, పశ్చిమగోదావరి, నెల్లూరు, తూర్పుగోదావరి జట్లపై గెలుపొందారు. ఫైనల్ పోటీలో కడప జిల్లా జట్టుతో తలపడి ద్వితీయ స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు రజక పథకాలు అందజేశారు. ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రదమ కనబరిచి జిల్లాకు రెండవ స్థానం ఉరవకొండకు మంచి పేరు తీసుకొచ్చిన క్రీడాకారులతోపాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మారుతీప్రసాద్, రాఘవేంద్రను అభినందించారు.

సిపిఐ నాయకులు శివన్న మృతికి సిపిఎం సంతాపం

అనంతపురం కలెక్టరేట్ : ఉరవకొండ ప్రాంతంలో సుదీర్ఘకాలం సిపిఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించిన చాలా శివన్న మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ సంతాపం వ్యక్తం చేశారు. చిన్ననాడే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై తుదిశ్వాస విడిచే వరకూ కొనసాగిన శివన్న లేని లోటు ప్రజా ఉద్యమాలకు తీరనిది అన్నారు. తన అభిప్రాయాలను నిర్మోహమాటంగా చెప్పడంలో శివన్నది ప్రత్యేక శైలి అన్నారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ ప్రజా ఉద్యమాల్లో పాల్గొనేవాడన్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అభివృద్ధి కావాలని నిత్యం ఆకాంక్షించేవాడన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

పలువురు నివాళి

ఉరవకొండ : సిపిఐ సీనియర్ నాయకులు పొత్తూరు శివన్న (73) బుధవారం అనారోగ్యంతో ఉరవకొండలో మృతి చెందారు. ఈయన ఎఐవైఎఫ్ నాయకులుగా, సిపిఐ ప్రధాన కార్యదర్శిగా, సిపిఐ అనుబంధ రైతు సంఘం రాష్ట్ర నాయకులుగా పని చేశారు. ఈనేపథ్యంలో అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, కేశవరెడ్డి, నాయకులు మల్లికార్జున, చెన్నారాయుడు, శ్రీధర్, గన్నే మల్లేష్, పురిడి తిప్పయ్య, వన్నూరమ్మ, సుల్తాన్‌తోపాటు సిపిఎం వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ వాట్సప్ సేవలు

శింగనమల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం 'వాట్సప్ గవర్నెన్స్'ను తీసుకొచ్చిందని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి మాసూలు చంద్రమోహన్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలు, వినతులను సులభంగా అధికారులకు చేరవేయవచ్చన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇంటి నుంచే దాదాపు 161 రకాల పౌరసేవలను పొందవచ్చన్నారు. ఇది పారదర్శక, సమర్థవంతమైన పాలనకు ఒక మైలురాయి అన్నారు. ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో 'బెల్ట్' వార్..!

ఏళ్లచింతలలో ఘటనతో వెలుగులోకి-బెల్టు షాపుల నిర్వహణలో తమ్ముళ్ల మధ్య ఆధిపత్యం

కళ్యాణదుర్గం పరిధిలో 350కు పైగానే బెల్టు షాపులు-ఒత్తిళ్లకు తలొగ్గిన ఎక్సైజ్, సివిల్ పోలీసులు .?

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పడ్డాయి. యథేచ్ఛగా మద్యాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బెల్టుషాపుల నిర్వహణ గ్రామాల్లో చిచ్చు రేపుతోంది. తాజాగా కుందుర్పి మండలం ఏళ్ల చింతలో బెల్టు షాపుల నిర్వహణ విషయంలో రెండు గ్రూపులు మారణాయుధాలతో పరస్పర దాడులకు పాల్పడిన ఘటన వెలుగు చూసింది. టిడిపికి చెందిన రెండు గ్రూపులు ఆధిపత్యాలకు దిగి ఒకరిపై ఒకరు భౌతిక దాడులు చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 15 మందిపై కుందుర్పి పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. గ్రామంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు పికెటింగ్ నిర్వహిస్తున్నారు.

గొడవ పడుతున్న తెలుగుదేశం మద్దతుదారులు

కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 350కు పైగా బెల్టుషాపులున్నట్లు ప్రాథమిక అంచనా. మొదట్లో బెల్టు షాపుల కోసం చాలా గ్రామాల్లో టిడిపి తమ్ముళ్ల మధ్య ఆధిపత్యం పోటీ చేసుకుంది. బెల్టు షాపులు నియంత్రించాల్సిన ఎక్సైజ్, సివిల్ పోలీసులు కూటమి పెద్దల కనుసన్నల్లో కళ్యాణివైన్స్ దుకాణాలు నిర్వహిస్తుండడంతో చూసీచూడనట్లు మిన్నకుండిపోతున్నారు. దీంతో గ్రామాల్లో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

నెలకు రూ.10కోట్లు వ్యాపారం

కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో రెండు ఎక్సైజ్ సర్కిళ్లు ఉన్నాయి. కళ్యాణదుర్గం సర్కిల్ పరిధిలో కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప మండలాలు ఉన్నాయి. ఈ మూడు మండలాల్లో 8 మద్యం దుకాణాలు అధికారికంగా నడుస్తున్నాయి. కంబదూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాల్లో నాలుగు మద్యం దుకాణాలు అధికారికంగా ఉన్నాయి. కళ్యాణదుర్గం సర్కిల్ పరిధిలోని 8 దుకాణాల్లో నెలకు రూ.7కోట్లు, కంబదూరు ఎక్సైజ్ పరిధిలోని నాలుగు దుకాణాల్లో నెలకు రూ.2.50కోట్లు అంటే సుమారు నెలకు రూ.10కోట్లు మద్యం వ్యాపారాలు జరుగుతున్నాయి. ఇవన్నీ కూటమి పెద్దలకు చెందిన కల్యాణివైన్స్ దుకాణాల పేరుతోనే నడుస్తుండడం గమనార్హం.

దుర్గం పరిధిలో 350కు పైగానే బెల్టు షాపులు

కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలోని రెండు ఎక్సైజ్ సర్కిల్ ఆధీనంలో 11 మద్యం దుకాణాలున్నాయి. ఈ పరిధిలో సుమారు 350కు పైగానే బెల్టుషాపులు నిర్వహణ సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని బెల్టు షాపులలో ఒక్కొ క్వార్టర్ బాటిల్ పై రూ.30లు అదనంగా దండుకుంటున్నారు. 11 మద్యం దుకాణాలలో నెలకు సుమారు రూ.8కోట్లకు పైగానే మద్యం వ్యాపారం జరుగుతోంది. ఈలెక్కన బెల్టుషాపులలో రూ.100, రూ.300 ధరలు ఉన్న క్వార్టర్ బాటిళ్లపై రూ.30లు అదనంగా వసూళ్లను సరాసరి క్వార్టర్ బాటిళ్లపై రూ.15లు లెక్కగట్టిన అధనంగా మద్యం బాబుల నుంచి నెలకు రూ.1.20కోట్లు బెల్టు షాపుల ద్వారా దండుకుంటున్నట్లు ప్రాథమిక అంచనా. ఈలెక్కన ఏడాదికి రూ.14కోట్లకు పైగానే బెల్టు షాపుల ద్వారా మందుబాబులను పీల్చిపిప్పి చేస్తున్నారనే విమర్శలున్నాయి.

కూటమి పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గిన ఎక్సైజ్, సివిల్ పోలీసులు..?

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కూటమి పెద్దల ఆధీనంలో మద్యం దుకాణాలు నడుస్తుండడం, పైగా గ్రామాలలో టిడిపి కార్యకర్తలు బెల్ట్ షాపులు నిర్వహిస్తుండడంతో వారి ఒత్తిళ్లకు తలొగ్గి ఎక్సైజ్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు గ్రామాల్లో ఘర్షణలకు దారితీస్తున్నాయి. ఇక సివిల్ పోలీసుల నుంచి ఈ కేసుల విషయంలో సరైన సమాధానం రావడంలేదు.

ఏళ్లచింతలలో 15 మంది పై కేసులు

కుందుర్పి మండలం ఏళ్లచింతల గ్రామంలో టీడీపీ వర్గీయుల మధ్య బెల్టు షాపుల కోసం జరిగిన పరస్పర దాడులలో 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు కుందుర్పి ఎఎస్ఐ రమేష్ తెలిపారు. వడ్డే చిన్నతిమ్మప్ప ఫిర్యాదు మేరకు వీరారెడ్డితో పాటు మరో తొమ్మిది మందిపైన, వీరారెడ్డి ఫిర్యాదు మేరకు వడ్డే తిమ్మప్పతో పాటు మరో ఐదుమందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

పరిశ్రమల పేరుతో భూములను లాక్కోవద్దు

డి.హీరేహాళ్ : పరిశ్రమలు, సోలార్ ప్రాజెక్టులు అంటూ పేద భూములను అంబానీ, అదానీ వంటి కంపెనీలకు కట్టబెట్టడాన్ని ఏపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం భూ సేకరణ చేపట్టాలన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు తగు నష్టపరిహారం రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదేవిధంగా వేలాది ఎకరాల వ్యవసాయ భూములను కంపెనీలకు అప్పగించి రైతులను బికారులుగా మారుస్తున్నారని విమర్శించారు. రైతుల నుంచి భూమి సేకరించిన గ్రామాల్లో 18ఏళ్ల రైతులకు 30ఏళ్లపాటు రూ.5వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బదిలీ వైద్య సిబ్బందికి సన్మానం

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తూ ఉద్యోగోన్నతిపై బదిలీ వెళ్లిన వైద్య సిబ్బందిని బుధవారం ఘనంగా సత్కరించారు. పిహెచ్ఎన్ సుమతీదేవి, ఎంపిహెచ్ఇఒ లక్ష్మన్న, సూపర్‌వైజర్ సరోజమ్మ, ఎఎన్ఎంలు రంగమ్మ, విజయలక్ష్మి, శోభ, రమాదేవి, రామలక్ష్మి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, రాయలచెరువు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజన్, డాక్టర్ అప్పయ్య, చుక్కలూరు సూపర్‌వైజర్ ఎంపి నారాయణ, యాడికి సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, 104 సిబ్బంది నాయుడు, అనిల్, హెల్త్ అసిస్టెంట్లు నారాయణస్వామి, కిరణ్‌కుమార్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళిక రూపకల్పనపై అవగాహన

రాయదుర్గం : రాయదుర్గం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) రూపొందించిన సమగ్ర పట్టణ ప్రణాళికపై సచివాలయాల సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అహుడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ గురించి వివరించారు. ముఖ్యంగా సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, వీఆర్వోలు, మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌ను పరిశీలించి అవగాహన కల్పించాలన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 25వ తేదీలోగా మున్సిపల్ కార్యాలయంలో కోరారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

బోర్డును ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ఉరవకొండ : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్‌ఛార్జి మహానంది పర్యవేక్షణలో 67వ జాతీయ రహదారి రోడ్డులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా విడపనకల్ పోలీస్‌స్టేషన్ సరిహద్దు ప్రారంభం, సరిహద్దు ముగింపు వద్ద 'రోడ్డు నిర్మాణ దశలో ఉన్నందున, నెమ్మదిగా వెళ్లండి' అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. వీటితోపాటు రోడ్డు డైవర్షన్ పాయింట్ల దగ్గర సిగ్నల్ బోర్డులు, ట్రాఫిక్ కానిస్టేబుల్ ఫొటో షీట్‌ను కూడా ఏర్పాటు చేశారు.

చంద్రమోహన్ మృతి తీరని లోటు

బుక్కరాయసముద్రం : వైసిపి సీనియర్ నాయకు మడకశిర చంద్రమోహన్ (55) గుండెపోటుతో మృతిచెందడం తీరని లోటు అని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ వింగ్ కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈమేరకు మండల కేంద్రంలోని చంద్రమోహన్ స్వగృహానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం

యాడికి : ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వైసిపి సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని పిన్నేపల్లిలో 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను కూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు లక్ష్మిరెడ్డి, శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కొండారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, 19వ వార్డు సభ్యులు శ్రీరాములు, అగ్గిరాముడు, కంబగిరి రాముడు, వెంకటరాముడు, రోశన్న, శివ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులతో ఛైర్మన్ సమీక్ష

అధికారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఛైర్మన్ పూల నాగరాజు

అనంతపురం : రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15న ప్రారంభం కానున్న మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే స్త్రీశక్తి పథకంపై ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా పథకం అమలుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రీజినల్ మేనేజర్ శ్రీలక్ష్మి, డిపో మేనేజర్ నాగభూపాల్, బస్టాండ్ ఇన్‌ఛార్జి మూర్తి, హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

బెలుగుప్ప : దుకాణాల యజమానులు రైతులకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ అనిల్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని మన గ్రోమోర్, సంకల్ప ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గోదాముల్లో ఉన్న ఎరువులు, స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసిన ఎరువుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎరువులు దుకాణంలో ఉన్న రైతులతో మాట్లాడి ఎరువుల లభ్యతపై ఆరాతీశారు.

గురప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన

పుట్లూరు : మండల పరిధిలోని తక్కల్లపల్లి గ్రామంలో గురప్ప స్వామి నూతన విగ్రహాన్ని బుధవారం ఘనంగా ప్రతిషించారు. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేసి విగ్రహ ప్రతిష్ట చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపునకు కృషి

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జిఎం రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేదుకు కృషి చేస్తున్నామని హైదరాబాదు పబ్లిక్ స్కూల్ జిఎం రామసుబ్బారెడ్డి, సిఇఒ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం అనంతపురంలోని గుత్తి రోడ్డులో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఇన్వెస్టిట్యూర్ సెర్మెనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్నికలు నిర్వహించి స్కూల్ హెడ్‌బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్‌బాయ్, డిప్యూటీ హెడ్‌గర్ల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల పాత్ర చాలా ముఖ్యమైందన్నారు. ఇందులో భాగంగానే ఓటు ద్వారా ఎన్నుకునే నాయకుల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు నియామక బ్యాడ్జిలను అందించారు.

వేడుకలకు హాజరైన విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో) గౌరవ వందనం స్వీకరిస్తున్న అతిథులు

రాచానపల్లి సొసైటీ ప్రెసిడెంట్‌గా పాముదాయి రఘు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ పరిధిలోని పాముదాయి గ్రామానికి చెందిన రఘు రాచానపల్లి సహకార సంఘం ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రఘు తన తండ్రి లక్ష్మయ్య నుంచి పార్టీలో చురుగ్గా పని చేస్తున్నారు. తండ్రి బాటలోనే రఘు పయనిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. రఘు సేవలను గుర్తించిన టిడిపి అధిష్టానం, ఎమ్మెల్యే పరిటాల సునీత రాచానపల్లి సహకార సంఘం ఛైర్మన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పాముదాయి మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీతకు, యువ నాయకులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఎడిసిసి సొసైటీ ఛైర్మన్‌గా కేశన్న

బుక్కరాయసముద్రం : మండల ఎడిసిసి సొసైటీ ఛైర్మన్‌గా కేశన్న నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మాజీ జడ్పిటిసి కట్టప్పగారి రామలింగారెడ్డి సహకారంతో తనకు ఛైర్మన్ పదవి వచ్చినట్లు తెలిపారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ఈయనతోపాటు డైరెక్టర్లుగా కొత్తపల్లి గంపన్న, రేగడికొత్తూరు రామాంజనేయులు నియమితులయ్యారు.

వైసిపి మండలాధ్యక్షుడిగా శివశంకర్

యల్లనూరు : వైసిపి మండల అధ్యక్షుడిగా గొడ్డుమర్రి శివశంకర్ నియమితులయ్యారు. ఈమేరకు వైసిపి అధినేత జగన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు శివశంకర్‌కు అభినందనలు తెలిపారు.

జి.శివశంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

జెవివి నగర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక నగర నూనత కమిటీని ఎన్నుకున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జెవివి నగర మహాసభలు ఈ నెల 3న విజయవంతంగా ముగిశాయని అందులో భాగంగా జెవివి నగర నూతన కమిటిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా సాకే భాస్కర్ వ్యవహరించి నూతన కమిటీ ప్రకటించారని తెలిపారు. 25 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. జెవివి నగర అధ్యక్షులుగా కెఎన్ఎస్ ప్రసాద్‌రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శిగా సాకే తిరుపాల్, కోశాధికారి ఎం.రామిరెడ్డి ఎన్నికైనట్లు తెలిపారు. వీరితోపాటు ఉపాధ్యక్షులు డాక్టర్ పి.ప్రసూన, ఎస్.గాంగేనాయక్, అర్జున్‌నాయక్, కె.వీరరాజు, జి.ముత్యాలన్న కార్యదర్శులు వై.రామకృష్ణ, ఎ.ప్రసాద్, కె.నాగరత్నమ్మ, ఎం.శశికళ, కె.తిప్పేస్వామితోపాటు 10 మంది కమిటీ సభ్యులుగా ఎంపికైనట్లు వివరించారు.

పాఠశాలకు టివి వితరణ

పాఠశాలకు టివి అందజేస్తున్న లోకేష్

కళ్యాణదుర్గం టౌన్ : శెట్టూరు మండలం బొచ్చుపల్లి గ్రామ గొల్లలదొడ్డి ప్రాథమిక పాఠశాలకు యూనియన్ బ్యాంకు ఉద్యోగి లోకేష్ టీవీని వితరణ చేశారు. ఈమేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈరన్నకు బుధవారం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ ఉద్యోగి వితరణ పట్ల పాఠశాల ఉపాధ్యాయులు మంజునాథ, కాంప్లెక్స్ ఛైర్మన్ రామకృష్ణ, పాఠశాల కమిటీ ఛైర్మన్ రాజన్న అభినందించారు.

అనాథాశ్రమంలో అన్నదానం

పుట్లూరు : మండలంలోని కోమటికుంట్ల గ్రామానికి చెందిన చాకలి ఆదినారాయణ, యల్లమ్మ దంపతుల కుమారుడు నవీన్ పుట్టిన రోజు సందర్భంగా తాడిపత్రి సమీపంలోని ఆవుల తిప్పాయపల్లిపల్లి వద్ద ఉన్న రమణ మహర్షి అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నవీన్, మిత్రులు నరేష్, పవన్, ప్రవీణ్, వేణు, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దాతలు

స్మార్ట్‌మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగులగొట్టండి అని పిలుపునిచ్చి.. అధికారంలోకి వచ్చాక అవే స్మార్ట్ మీటర్లను బిగించడం బాధాకరమన్నారు. దీంతోపాటు విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారన్నారు. ఇప్పటికే పేదలపై రూ.15వేల కోట్ల భారం మోపారన్నారు. మరో రూ.12,700 కోట్ల ఛార్జీల భారం వేసేందుకు సిద్ధమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వి.శివారెడ్డి, మండల కమిటీ సభ్యులు సి.నాగేంద్ర, నాయకులు సంజీవరెడ్డి, వెంకటకొండ, హరికృష్ణ, నాగలింగమయ్య, చన్నప్ప, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

చుండూరు మృతులకు నివాళి

నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ప్రకాశం జిల్లా చుండూరులో అగ్రవర్ణాల ఊచకోతలో మృతిచెందిన దళితులకు కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్, బీఎస్పీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. ముందుగా పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చుండూరు, కారంచేడు మృతులకు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు అంజన్‌ప్రసాద్, బీఎస్పీ నాయకుడు బండల రామాంజనేయులు మాట్లాడుతూ 1991లో చుండూరు కారంచేడులో అగ్రవర్ణాల వారు దళితులపై దాడి చేసి విచక్షణ రహితంగా కత్తులు, కొడవళ్లతో దాడి చేసి 10 మంది దళితులను ముట్టుబెట్టారన్నారు. దళితుల మారణహోమం జరిగి 24 ఏళ్లు పూర్తయ్యాయన్నారు. దళితులపై దాడి అగ్ర వర్ణాల అహంకారం, ఆధిపత్యానికి పరాకాష్ట అన్నారు. దళితులపై దాడులు చేసిన వారిని ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు వెంకట కొండయ్య, మాల మహానాడు నాయకులు అగ్గి రాముడు, మిద్దె ఓబులేసు, ఎంఆర్‌పిఎస్ నాయకులు అడవిరాముడు, రామాంజి, నీలం ఆదినారాయణ, చిన్న కుళ్లాయి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కూటమి ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, తిప్పేస్వామి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విశ్రాంత భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా నాలుగు నెలల కరువు బత్యాలు ఇవ్వాలని, 12వ పిఆర్‌సి నియమించలేదని, మధ్యంతర భృతిని చెల్లించాలని, తగ్గించిన అడిషినల్ క్వాంటమ్ ఆఫ్ పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు ఇలియాజ్, విశ్రాంత ఉద్యోగుల అసోషియేషన్ సంక్షేమం కోసం రూ.10116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాతిరెడ్డి, భగనవాన్‌దాస్, ఇస్మాయిల్, శివప్రసాద్, కృష్ణమూర్తి, ఓబుళప్ప, నాగరాజు, హంపన్న, మరెన్న, వన్నూరుస్వామి, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘానికి విరాళం అందజేస్తున్న ఇలియాజ్

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు వసంతకుమార్, కార్యదర్శి రామయ్య డిమాండ్ చేశారు. బుధవారం గణేనాయక్ భవన్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. టిడిపి కూటమి ప్రభుత్వం పాలనలో నూతనంగా చేపట్టి పింఛన్ రీసర్వే, సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్, సదరం సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం, పెన్షన్లు నిలిపివేత వంటి సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం వికలాంగులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. వికలాంగులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వికలాంగులకు ఇచ్చిన హామీలను త్వరగా నెరవేర్చాలన్నారు. 2019 కంటే ముందు వివాహమైన దివ్యాంగులకు వివాహ ప్రోత్సాహకాలు 2022 ఆగస్టులో నిలిపివేసినట్టు వంటి పెన్షన్లు పునరుద్ధరణ, యుడిఐడి కార్డ్స్ పంపిణీ, సంక్షేమ పథకాలు అమలు రాష్ట్ర ప్రభుత్వం వీటిపై త్వరితగతిన పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. వికలాంగుల జాతీయ వేదిక అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శిగా రాజేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, నాయకులు మధు, రంగయ్య, సుధాకర్, మోహన్, నరసింహులు, వెంకటేష్, కుళ్లాయప్ప, నాగన్న, లక్ష్మి, శ్రీనివాసులు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

గుంతకల్లు : పట్టణంలో అక్రమ లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వ పట్టణ ప్రణాళికా శాఖ ఎల్‌ఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు ప్రభుత్వ భూములు స్వాధీనం

ప్రజాశక్తి-యాడికి

పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు ప్రభుత్వ భూములను బుధవారం జెన్‌కో వారికి ముందస్తుగా అప్పగించినట్లు తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. 950 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ స్థాపన కోసం మండల పరిధిలోని కుందనకోట గ్రామంలో 179.523 ఎకరాలు, కమలపాడు గ్రామంలో 75.38 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూములను తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ శేషసాయి, విలేజ్ సర్వేయర్ మౌలాలి, గ్రామ రెవెన్యూ అధికారులు భీమేశ్వర్‌రెడ్డి, గంగన్న, దామోదర్‌నాయుడు, జెన్‌కె సిబ్బంది పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

వృద్ధుని నుంచి పింఛన్ సొమ్ము అపహరణ

బ్రహ్మసముద్రం : ఓ వృద్ధుడిపై కళ్లల్లోకి కారంపొడి కొట్టి తాను దాచుకున్న రూ.30వేల పింఛన్ నగదును అపహరించిన ఘటన బుధవారం మండల పరిధిలోని మాముడూరు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మామడూరు గ్రామానికి చెందిన బోయ భూతప్ప తన సొంత వ్యవసాయ భూమిలో కాయగూరలు, ఆకుకూరలు పండించి గ్రామాల్లో విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలోనే బుధవారం పాల వెంకటాపురం గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలంలో ఒంటరిగా ఉండడం గమనించిన దుండగులు వృద్ధుడి కళ్లలో కారంపొడి చల్లి రూ.30వేల నగదును దొంగలు అపహరించారు. విషయం తెలుసుకున్న కుమారుడు రామాంజి తన తండ్రిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఎస్ఐ నరేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు.